
సాక్షి ములుగు

ఆదివారం । 12 । మార్చి । 2023



బీఆర్‌ఎస్ పోరాటం ఆగదు

బీజేపీ, కేంద్రంపై తమ పార్టీ పోరాటం ఆగదని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. కేంద్రం కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తోందన్నారు - 8లో▸



కార్మికుల పరం చేయాలి

ఆజాంజాహి మిల్లు కార్మికుల యూనియన్ కార్యాలయాన్ని కార్మికుల పరం చేయాలని జీఎండబ్ల్యూపీ మావోయిస్ట్ డివిజన్ కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $34^0 / 20^0$

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగి ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రిజర్వేషన్ సాధించే వరకు ఉద్యమం



వెంకటాపురం(కె): మాదిగలకు 12శాతం రిజర్వేషన్ సాధించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని మాదిగ జేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాసం రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని శనివారం నిర్వహించిన మాదిగ జేఏసీ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 15వ తేదీన హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఆవరణలో నిర్వహించనున్న బహుజన రాజకీయ చైతన్య సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు పిడమర్తి రవి నాయకత్వంలో బహుజన పితామహుల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు తోకల శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మారథాన్

భూపాలపల్లి రూరల్: నేడు (ఆదివారం) ఉదయం 5గంటలకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో జీఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో 21, 10, 5 కిలోమీటర్లు మారథాన్ నిర్వహించనున్నారు. ఈ మారథాన్‌లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్రజ్యోతితో పాటు కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ దివాకర, ఎస్పీ సురేందర్‌రెడ్డి పాల్గొననున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



భూపాలపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు సూచించారు. ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను పురస్కరించుకొని మెప్మా ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో మెప్మా, శానిటేషన్ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు శనివారం క్రీడా, వంటల పోటీలు, కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ అవినాష్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారిణి బుర్ర సునిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైద్యాధికారుల అసోసియేషన్ ఎన్నిక

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల (తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్) అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక శనివారం నిర్వహించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కత్తి జనార్దన్ తెలిపారు. జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ హిమబిందు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ నాగరాణి, కోశాధికారిగా డాక్టర్ సందీప్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ప్రమోద్, డాక్టర్ నవత, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ మౌనిక, అసోసియేట్ అధ్యక్షులుగా డాక్టర్ స్వాతి, డాక్టర్ అనూష, కన్వీనర్‌గా డాక్టర్ మౌనిక, ఆర్గనైజర్ సెక్రెటరీగా డాక్టర్ సుష్మిత, అడ్వైజ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ రోహిణి, డాక్టర్ ఆశాజ్యోతి, డాక్టర్ నాగశ్రీ, డాక్టర్ రాజు, డాక్టర్ నిహారికలను నియమించినట్లు తెలిపారు.

కార్మికుల సంక్షేమంపై శ్రద్ధ లేదా..?



భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికుల రక్షణ గురించి ఆలోచిస్తున్న అధికారులు సంక్షేమంపై ఎందుకు శ్రద్ధచూపడం లేదని సీఐటీయూ బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య ఆరోపించారు. ఏరియాలోని కేటీకే 1వ గనిని శనివారం సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులను, ఇతర పనుల నిమిత్తం గని ఆవరణలోకి వచ్చే వారికి హెల్మెట్ లేకుండా లోపలికి అనుమతించడం లేదన్నారు. విధులకు హాజరయ్యే కార్మికులకు ఏర్పాటుచేసిన క్యాంటీన్ సేవలు నిలిపివేశారని, వేసవి కాలం సమీపించినప్పటికీ ఇప్పటి వరకు ఫ్రిజ్‌లు ఏర్పాటు చేయలేదన్నారు. సెక్యూరిటీ గదుల్లో సరైన ఫర్నిచర్ లేదని, ఫ్యాన్‌లు పని చేయడం లేదని ఆరోపించారు. ఉత్పత్తిపైన శ్రద్ధ చూపుతున్న అధికారులు సంక్షేమాన్ని సైతం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు.

చాప కింద నీరులా..

- ఏజెన్సీలో మావోయిస్టుల కదలికలు
- వరుస ప్రెస్‌నోట్లతో కలకలం
- అటవీ గ్రామాలపై దృష్టి సారించిన పోలీసులు
- డ్రోన్ల సాయంతో నిఘా



ఏటూరునాగారం: జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో మావోయిస్టుల కదలికలు చాప కింద నీరులా ముందుకు సాగుతున్నాయి. గత కొద్ది కాలంగా ప్రెస్‌నోట్లు విడుదల చేస్తుండడంతో గ్రామాల్లో కలకలం రేగుతోంది. అధికార పార్టీ నాయకులు పేర్లు, బడా వ్యాపారులు, ఇన్‌ఫార్మర్ల పేర్లు సైతం అందులో ప్రకటించి అలజడి సృష్టిస్తున్నారు. ఇటీవల అటవీ ప్రాంతంలో బీరు బాంబు, మైన్స్, మందుపాతరలను తరుచుగా పోలీసులు కనిపెట్టడంతో మావోయిస్టులు ఏదైనా దుశ్చర్యలకు పాల్పడే అవకాశాలు ఉన్నట్లుగా ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి.

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో..

గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలను మావోయిస్టులు తమ సేఫ్ జోన్‌గా మలుచుకున్నారు. జిల్లాలోని దట్టమైన అడవిలో నివసించే గిరిజనులను తమకు అనుకూలంగా మార్చుకుని కరపత్రాలను పంపిణీ చేయటం, పలు విధ్వంసకర చర్యలకు పాల్పడుతూ తమ ఆధిపత్యం పెంచుకునేందుకు ముందడుగు వేస్తున్నారు. దీంతో మావోయిస్టులు అడవిలో ఒక పల్లె నుంచి మరో పల్లెకు స్వేచ్ఛగా తిరగడం, యువతను వారికి అనుకూలంగా మార్చుకుంటున్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్రంలోకి..

ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు నుంచి భారీ సంఖ్యలో మావోయిస్టులు రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నట్లు కేంద్ర నిఘా వర్గాలు సైతం ధ్రువీకరించాయి. సెంట్రల్ ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీస్ విభాగాలకు సహకరించడానికి బీఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతోంది.

మావోయిస్టుల కార్యకలాపాలపై డేగకన్ను

ఛత్తీస్‌గఢ్, తెలంగాణ పోలీసులు ఉమ్మడిగా మావోయిస్టుల కార్యకలాపాలను అణిచివేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లుగా తెలిసింది. అందులో భాగంగా డ్రోన్లతో దట్టమైన అటవీ ప్రాంతాలు, ఎత్తైన గుట్టలు, గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లోని కాలిరేవులపై నిత్యం పర్యవేక్షణలు చేస్తున్నట్లుగా తెలిసింది. ఎక్కడైనా మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు గుర్తిస్తే అక్కడే అందుబాటులో ఉన్న గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలను పంపి జల్లెడలు పట్టిస్తున్నారు.



డ్రోన్‌తో ఏజెన్సీలో పోలీసుల నిఘా

నిత్యం తనిఖీలు

ఏటూరునాగారం, వెంకటాపురం మండలాల ప్రధాన రహదారులతో పాటు రెండు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న గోదావరి ముళ్లకట్ట బ్రిడ్జిపై నిత్యం పోలీసులు వాహన తనిఖీలను నిర్వహిస్తున్నారు. పూసూరు వద్ద ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే వాహనాలను క్షణ్ణంగా పరిశీలించిన అనంతరమే అనుమతిస్తున్నారు. ఎలాంటి చిన్న అనుమానం వచ్చినా చాలు పూర్తిగా విచారించిన తర్వాతే వదిలేస్తున్నారు.

పర్యాటకుల సందడి

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. రెండో శనివారం సెలువురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చి రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, టూరిజం గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేష్ ఆలయ విశిష్టత వివరించారు. నందీశ్వరుడిని సైతం దర్శించుకున్న పర్యాటకులు అనంతరం సరస్సుకు చేరుకుని బోటింగ్ చేశారు.



రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పర్యాటకులు



రామప్ప ఆలయంలో పర్యాటకుల సందడి



నందీశ్వరుడి వద్ద విద్యార్థుల కోలాహలం

హేమాచలక్షేత్రంలో ఏఎస్పీ పూజలు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు గుట్టపై వెలిసిన హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి సారిగా వచ్చిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఏఎస్పీ కుటుంబ సభ్యుల గోత్రనామాలతో ప్రత్యేక అర్చన జరిపించారు. అనంతరం ఆలయ పురాణం, స్వామివారి చరిత్ర వివరించి ఆశీర్వచనం ఇచ్చారు. ఆయన వెంట ఎస్సై తాహెర్‌బాబా ఉన్నారు.



హేమాచల క్షేత్రంలో ఏఎస్పీ సంకీర్త్

ముగిసిన నాగులమ్మ జాతర



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రధాన పూజారి రామకృష్ణస్వామి



గండొర్రెగుట్టకు నాగులమ్మను వనప్రవేశానికి సాగనంపుతున్న పూజారులు

- నాగులమ్మ, సడాలమ్మకు ప్రత్యేక పూజలు
- డోలువాయిద్యాల నడుమ అమ్మవార్ల వనప్రవేశం

మంగపేట: మండల పరిధిలోని లక్ష్మీనర్సాపురం నాగులమ్మ ఆలయంలో ఐదు రోజులుగా అత్యంత వైభవంగా జాతర కొనసాగింది. శనివారం సాయంత్రం నాగులమ్మ, సడాలమ్మ అమ్మవార్ల వన ప్రవేశంతో జాతర ముగిసింది. చివరి రోజు ముగింపు కార్యక్రమాన్ని ఆలయ ట్రస్టీ, ప్రధాన పూజారి(నాగులమ్మ ఉపాసకుడు) బాడిష రామకృష్ణ స్వామి ఆధ్వర్యంలో పూజారులు, వడ్డెలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులమ్మ, సడాలమ్మ, వనదేవతకు గిరిజన సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు బాగుండాలని, ప్రకృతి వైపరీత్యాలు కలుగ కుండా, సమస్త ప్రజలు వ్యాధులకు గురికాకుండా సుఖ శాంతులతో ఉండాలని కోరుతూ పూజారులు, వడ్డెలు తల్లులకు పూజలు నిర్వహించి వేడుకున్నారు. అనంతరం ఆలయ సమీపంలోని వాగొడ్డుగూడెం అటవీ ప్రాంతంలోని ఎర్రట్టలగుట్టకు సడాలమ్మ అమ్మవారిని, గండొర్రెగుట్టకు నాగులమ్మను డోలు వాయిద్యాల నడుమ అమ్మవారి ప్రతి రూపాలైన జెండా కర్రలతో, లక్ష్మీనర్సాపురం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో వన ప్రవేశానికి సాగనంపారు. ఈ కార్యక్రమంలో నాగులమ్మ పూజారి బాడిష నాగరమేష్, నవీన్, సడాలమ్మ పూజారులు కొమరం ధనలక్ష్మి, నితిన్, పాపారావు, ఇర్ప నాగలక్ష్మి, వడ్డెలు సోడి సత్యం, కుర్సం పుల్లయ్య, ఈసం సమ్మక్క, కట్టం సమ్మక్క, ముయబోయిన శివ, కుర్సం నరేష్, కారం రాజేష్, సోడి శివనాగేశ్వరి, చౌలం భవాని, కుర్సం హేమలత, కారం రమాదేవి, కుల పెద్దలు, రామకృష్ణ సేవాట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



ఆలయంలో నాగులమ్మను దర్శించుకుంటున్న ప్రముఖులు

జాతర విజయవంతం

జాతర ముగింపు సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి రామకృష్ణస్వామి మాట్లాడారు. నాగులమ్మ జాతరకు తరలివచ్చి జాతర విజయవంతానికి సహకరించిన భక్తులందరికీ వనదేవతల ఆశీర్వాదం దక్కుతుందన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసిన ఏఎస్పీ సంకీర్త్, సీఐ రాజు, మంగపేట ఎస్సై తాహెర్‌బాబా, సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

చివరిరోజు ప్రముఖుల పూజలు

జాతర చివరి రోజు పలు ఉపాధ్యాయ, గిరిజన సంఘాల నాయకులతో పాటు పలు పార్టీల నాయకులు ఆలయంలోని నాగులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పొదెం కృష్ణప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జబ్బ రవి, మండల అధ్యక్షుడు కొమరం మాధవరావు, ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంకిడి బుచ్చయ్య, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కొమరం నర్సయ్య, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎడ్లపల్లి నర్సింహారావు, మల్లిఖంటి శంకర్, నిమ్మగడ్డ ప్రవీణ్, బండ్ల మధుప్రసాద్, వెంకట రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మల ముఖర్జీ, గంగెర్ల రాజారత్నం తదితరులు ఉన్నారు.

టికెట్ రేసులో నెగ్గేదెలా..!?

- అంతర్మథనంలో బీఆర్‌ఎస్ ఆశావహనేతలు..
- సిట్టింగ్‌లకే టికెట్లు.. మరోసారి కేసీఆర్ స్పష్టత
- ప్రతికూలతలు, సర్వే రిపోర్టుల కోసం వెయిటింగ్
- ఎమ్మెల్యే టికెట్ రేసులో పలువురు.. ఒక్క శాతంపైనా ఆశలు



సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నం చేసే బీఆర్‌ఎస్ నేతలకు మళ్లీ షాక్ తగిలింది. వచ్చే ఎన్నికల్లో 99 శాతం సిట్టింగ్‌లకే టికెట్లు ఇస్తామన్న కేసీఆర్ ప్రకటన ఆశావహనేతలను అంతర్మథనంలో పడేసింది. సుమారు ఆరు మాసాల క్రితం జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించిన పార్టీ అధినేత.. తాజాగా శుక్రవారం సైతం సిట్టింగ్‌ల ప్రస్తావన తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో సిట్టింగ్‌ల స్థానంలో టికెట్ ఆశిస్తున్న నేతల ఆశలు సన్నగిల్లగా.. ఒక్కశాతంలో సైతం అవకాశం రాకపోతుందా? అన్న వేచిచూసే ధోరణి ప్రదర్శిస్తున్నారు. వచ్చే ఎన్నికల కోసం పలువురు సీనియర్లు, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో దిగుతారన్న ప్రచారం ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా జరిగింది. పార్టీ అధినేత కేసీఆర్ మాత్రం సిట్టింగులకే ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించడం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.

ఎమ్మెల్యే టికెట్ రేసులో పలువురు..

ఎన్నికలకు సుమారు తొమ్మిది నెలల సమయం ఉండగానే కేసీఆర్ చేసిన ప్రకటన సిట్టింగ్ ఎమ్మెల్యేలు, వారి అనుచరగణంలో కొత్త జోష్ తెచ్చింది. సర్వే రిపోర్టులు ఏం చెబుతున్నా.. 99 శాతం సిట్టింగ్‌లకే మళ్లీ టికెట్లు ఇస్తామని అధినేత ప్రకటించడం పట్ల ఆ వర్గాల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది. అయితే ఒక్క శాతంలో ఎక్కడ ఎవరు అవకాశం కొల్పోతారు? అన్న చర్చ కూడా ఇదే సమయంలో జరుగుతోంది. గతంలో సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరిగింది. జనగామలో ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఎమ్మెల్యేగా ఉండగా అక్కడ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేరు ప్రచారంలో ఉంది. పరకాలలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితోపాటు నాగుర్ల వెంకటేశ్వర్లు, భూపాలపల్లిలో ఎమ్మెల్యే గండ్ర వర్సెస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ స్థానంలో ఎంపీ కవిత ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరిగింది. అదే విధంగా డోర్నకల్‌లో ఎమ్మెల్యే రెడ్యానాయక్ స్థానంలో మంత్రి సత్యవతిరాథోడ్, వరంగల్ తూర్పులో ఎమ్మెల్యే నరేందర్‌తో పాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ రవిచంద్ర, మేయర్ సుధారాణిల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా డా.టి.రాజయ్య ఉండగా, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అక్కడినుంచి పోటీకి ఆసక్తి చూపుతున్న ప్రచారంతో ఆ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి కనిపిస్తోంది.

ఒక్క శాతంపైనే నేతల ఆశలు...

వచ్చే ఎన్నికల్లో 99 శాతం సిట్టింగ్‌లకే అవకాశం ఇస్తామనడంతో ఒక్క శాతంపైన నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఆ అవకాశాన్ని సైతం వదులుకోవద్దన్న కోణంలో ఎవరి స్థాయిలో వారు లాబీయింగ్‌కు సిద్ధమవుతున్నారు. గతంలోనే సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నచోట ప్రయత్నాలు చేస్తున్న నేతలపైన అధిష్టానం వరకు ఫిర్యాదులు కూడా వెళ్లాయి. జనగామ, పరకాల, వరంగల్ తూర్పు, మహబూబాబాద్ నియోజకవర్గాలకు చెందిన పొలిటికల్ పంచాయితీ ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల వరకూ వెళ్లింది. మరో రెండు నియోజకవర్గాలలో ఇదే పరిస్థితి ఏర్పడినా.. స్థానిక మంత్రుల సమక్షంలో సద్దుమణిగిందన్న చర్చ ఉంది. సిట్టింగ్‌లు, ఆశావహుల వివాదం ఉన్న నియోజకవర్గాల నేతలను కేటీఆర్ పిలిచి మాట్లాడారు. ఈ నేపథ్యంలో ఆశావహులుగా పేరున్న ఎమ్మెల్సీలు, ఇతర నేతలు ఆ నియోజకవర్గాల నుంచి పోటీలో ఉండడం లేదని ప్రకటించారు. తాజాగా మరోసారి టిక్కెట్ల వ్యవహారం తెరమీదకు రాగా, ఎన్నికలకు సుమారు తొమ్మిది నెలల ముందుగానే సిట్టింగ్‌లకే సీట్లంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆశావహులను అంతర్మథనంలోకి నెట్టివేశాయి. అయినప్పటికీ ఒక్క శాతంలోనైనా తమకు అవకాశం రాకపోతుందా? అంటున్న ఆశావహులు... కేసీఆర్ వ్యాఖ్యలను తాజా రాజకీయ పరిస్థితుల కోణంలో చూడాలంటుండడం రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

బూత్ కమిటీ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

మంగపేట: జిల్లా కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించనున్న బూత్‌కమిటీ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నరహరి వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు లొడె శ్రీనివాస్ అధ్యక్షతన మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. బూత్‌కమిటీ సమ్మేళన కార్యక్రమానికి మండలంలోని అన్ని బూత్ కమిటీల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మోసపూరిత మాటలతో నిరంకుశ కుటుంబ పాలన కొనసాగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడం కేవలం బీజేపీకే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అల్లె జనార్దన్, కార్యదర్శి రవీందర్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా, జిల్లా నాయకులు దంతెనపెల్లి నరేందర్, గూడబోయిన సురేష్, నాగుల్‌మీరా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

స్మారక క్రీడలు ప్రారంభం

మహాముత్తారం: మండలంలోని కనుకునూర్ గ్రామంలో కొమురంభీం యూత్, అనసూయమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో యానక శ్రీనివాస్ స్మారక వాలీబాల్ భూపాలపల్లి, ములుగు జిల్లాల క్రీడలను శనివారం ప్రారంభించారు. ఈ క్రీడలను బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పోడెం దామోదర్, ఆదివాసీ విద్యార్థి సంఘం ములుగు జిల్లా ఇన్‌చార్జ్ ఆలం నగేష్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు అంజిబాబు, సందీప్, విజయకుమార్, బాబు, బొచ్చు రమేష్, తోలెం ప్రశాంత్ పాల్గొన్నారు.

రోడ్లపైనే పశువులు

- ప్రమాదాల బారిన వాహనదారులు



సుభాష్‌కాలనీ రహదారిపై పడుకున్న పశువులు

భూపాలపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రధాన రహదారులపై పశువులు పడుకుంటున్నాయి. దీంతో రాత్రిపూట వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి సుభాష్‌కాలనీ, కృష్ణ కాలనీ వెళ్లే రహదారుల్లో వీధి దీపాలు అంతంత మాత్రంగానే వెలుగుతున్నాయి. దీనికి తోడు రహదారిపై ఆవులు, గేదెలు, ఎడ్లు పడుకుంటున్నాయి. దీంతో రాత్రి పూట ద్విచక్ర వాహనదారులు పశువుల ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో మున్సిపాలిటీ అధికారులు పలుమార్లు రోడ్లపై ఉన్న పశువులను ములుగు జిల్లా రామప్పలోని గోశాలకు తరలించారు. అయినప్పటికీ కొందరు తమ పశువులను కట్టివేయకపోవడంతో సమస్య ఉత్పన్నం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

మహిళాభ్యుదయానికి కృషి

ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

- వివరాలు 10లో▸

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య

ములుగు: మాతా, శిశు సంరక్షణ(ఎంసీహెచ్)లో భాగంగా గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య వైద్యాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రాయినిగూడెం పీహెచ్‌సీ పరిధిలోని జంగాలపల్లి, కన్నాయిగూడెం సబ్ సెంటర్లు, కాటాపూర్ పీహెచ్‌సీ పరిధిలోని బీరెల్లి సబ్ సెంటర్, రొయ్యూరు పీహెచ్‌సీ పరిధిలోని చల్పాక సబ్ సెంటర్లు వైద్య సేవలు అందించడంలో వెనుకబడి ఉండడంతో శనివారం డీఎంహెచ్‌ఓ తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వైద్య సేవలపై ఆరా తీసి వైద్యులను మందలించారు. ఇకపై ప్రతీ బుధవారం ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, వైద్యాధికారులు సమీక్ష నిర్వహించుకుని పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఎంసీహెచ్‌లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌సీడీ, టీబీ, టీహబ్ కార్యక్రమాల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షలో వైద్యాధికారులు డాక్టర్ పోరిక రవీందర్, మంకిడి వెంకటేశ్వర్లు, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి పవన్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య

ధాన్యం డబ్బులు చెల్లించాలని ఆందోళన

కాటారం: వానాకాలం సీజన్‌లో విక్రయించిన ధాన్యానికి రెండు నెలలు దాటినా డబ్బులు అందకపోవడంతో రైతులు ఆందోళన బాట పట్టారు. కాటారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో జాతీయ రహదారిపై కాటారం మండలంలోని విలాసాగర్, లక్ష్మీపూర్, మల్లారం గ్రామాలకు చెందిన రైతులు శనివారం ధర్నా చేపట్టారు. మూడు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల పరిధిలో సుమారు రూ.కోటి వరకు ధాన్యం డబ్బులు అందలేదని అన్నారు. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన డబ్బులు కుప్పలుగా పెరిగిపోతున్నాయని ఆరోపించారు. పిల్లల స్కూల్ ఫీజులు కడదామంటే చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పలు కారణాలు చెప్పి దాటవేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. తమకు డబ్బులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని సీఐ రంజిత్‌రావు రైతులకు హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో రైతులు రాజేశ్వర్‌రెడ్డి, వాణి, శ్రీను, రామన్న, వెంకన్న, రాంచందర్, సమ్మయ్య, బాన్ రెడ్డి, తిరుపతి, రాజు, మోహన్‌రెడ్డి, లచ్చన్న, రామక్క, పెద్దగట్టు, రమేశ్ తదితరులు ఉన్నారు.



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

రైల్వే ఉద్యోగం ఇప్పిస్తామంటూ దంపతుల మోసం

కాజీపేట: రైల్వే ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. దర్గా కాజీపేటకు చెందిన కాసంశెట్టి శ్రీకాంత్, అతడి భార్య శ్రీలత రైల్వే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి అఫ్జల్‌నగర్ ప్రాంతానికి చెందిన ఇందిర రాధ అనే మహిళ భర్త నుంచి రూ.27 లక్షలు తీసుకున్నారు. తన భర్తకు ఉద్యోగం రాలేదని ఎన్నిసార్లు అడిగినా డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఇందిర రాధ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

20 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



కేసముద్రం: కర్నాటకలోని బీదర్ నుంచి అక్రమంగా బొలేరో వాహనంలో తరలిస్తున్న 20 క్వింటాళ్ల నల్లబెల్లం, క్వింటా పటికను మండలకేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్‌కు చెందిన వడితే శ్రీనివాస్ కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామ శివారు కిష్టాపురానికి చెందిన బానోత్ ఈర్యా కలిసి, కర్నాటకలోని బీదర్ నుంచి బొలేరోలో 20 క్వింటాళ్ల నల్లబెల్లం, ఒక క్వింటా పటికను కిష్టాపురం తండాకు తరలిస్తున్నారు. ఈక్రమంలో మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపించిన బొలేరో వాహనాన్ని తనిఖీ చేశారు. దీంతో వాహనంలోని నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకుని, బొలేరో వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు.

ప్రీమియం తక్కువ.. బోనస్ ఎక్కువ

- తపాలా సేవలు విస్తృతం
- 11 నుంచి 25 వరకు జీవిత బీమా మేళాలు
- పాలసీదారుల కుటుంబాలకు భద్రత

మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలో 15 ఉప తపాలా కార్యాలయాలు, 211 బ్రాంచ్ కార్యాలయాలున్నాయి. దేశవ్యాప్తంగా తపాలా శాఖ కాలానుగుణంగా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రజల అవసరాలు, తదితర విషయాలను దృష్టిలో పెట్టుకుని పలు స్కీంలు, ఇన్సూరెన్స్ రంగం, పాస్‌పోర్ట్ కేంద్రం సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ప్రధానంగా ప్రస్తుతం ఇన్సూరెన్స్ రంగంపై దృష్టి సారించింది. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఇది గతంలో కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తించేంది. కానీ.. ప్రస్తుతం జీవిత బీమాను డిగ్రీ ఉత్తీర్ణులు, ఏదేని వృత్తి విద్యా కోర్సులు పాసైన వారికి, ప్రైవేట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా ఇన్సూరెన్స్ కట్టుకునేలా అవకాశం కల్పించింది. ఇతర ఇన్సూరెన్స్ కంపెనీలు ఇచ్చే బోనస్ కన్నా ఎక్కువ బోనస్‌ను తపాలా శాఖ కల్పిస్తోంది. 'తక్కువ ప్రీమియం.. ఎక్కువ బోనస్' నినాదంతో తపాలా జీవిత బీమా ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ విస్తరించింది. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీం గ్రామాల్లో అయితే గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్‌ఐ)గా పేరు పెట్టారు. బీమాదారులు వారి ఆర్థిక స్తోమతను బట్టి సంవత్సరం, ఆర్నెళ్లు, మూడు నెలలు, నెల ప్రీమియం చెల్లించవచ్చు.



పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న హెడ్ పోస్ట్ మాస్టర్ పి.రాంచందర్

బీమాకు అర్హులెవరంటే..

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పట్టభద్రులకు అవకాశం కల్పించారు. కాగా.. 19 నుంచి 55 సంవత్సరాల వయస్సులోపు వారు అర్హులు. మూడేళ్ల ప్రీమియం చెల్లించిన వారికి లోన్ సౌకర్యం ఉంటుంది. ఆకస్మిక మరణం సంభవించినా పాలసీ చేసిన సొమ్మును, బోనస్‌ను కలిపి నామినీకి చెల్లిస్తారు. ఆన్‌లైన్ ద్వారా కానీ మొబైల్‌లో కానీ.. దేశంలో ఏ తపాలా కార్యాలయంలోని సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇన్సూరెన్స్‌లో పోస్టల్ లైఫ్ సంతోశ్ పాలసీనే ఎండోమెంట్ అస్యూరెన్స్ పాలసీ అంటారు. దాంతో పాటు సురక్ష, సువిధ, యుగళ్, సుమంగళ్ జీవిత బీమాలో ఐదు రకాలున్నాయి.

మొగ్గు ఎటువైపంటే..

ఎండోమెంట్ అస్యూరెన్స్‌తో ఎక్కువ లబ్ధి ఉన్నందున బీమాదారులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఇందులో మూడేళ్లకు లోన్ సౌకర్యం ఉంటుంది. మూడేళ్ల ప్రీమియం చెల్లించిన పాలసీలు మాత్రమే మధ్యంతర (సరెండర్) రద్దు చేసుకోవచ్చు. ప్రీమియంను ఆన్‌లైన్, మొబైల్ ద్వారా లేక తపాలా కార్యాలయాల్లో చెల్లించవచ్చు. లక్ష పాలసీపై రూ.5,200 బోనస్ సౌకర్యం ఉంటుంది. ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపు ఉంటుంది. పాలసీదారు ప్రమాదవశాత్తు మరణిస్తే పాలసీ విలువతో పాటు బోనస్ చెల్లించాలి. పాలసీ సమయం ముగిసిన తర్వాత తీసుకున్న బీమాకి బోనస్‌ను కలిపి మెచ్యురిటీగా పాలసీదారుడికి చెల్లిస్తారు.

మీకోసం

25వ తేదీ వరకు మేళాలు

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్(పీఎల్‌ఐ) గ్రామీణ తపాలా జీవితబీమా (ఆర్‌పీఎల్‌ఐ) ప్రీమిమం లక్ష్యంగా తపాల శాఖ తెలంగాణ సర్కిల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలోని అన్ని సబ్ పోస్టాఫీస్‌లలో, బ్రాంచి పోస్టాఫీస్‌లలో మేళాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 11 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేసి ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

పట్టభద్రులకు అవకాశం..



బీమా చేసుకునేందుకు ఉద్యోగులు, పట్టభద్రులకు అవకాశం కల్పించారు. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ కావడంతో ఆసక్తి చూపుతున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాలసీదారుల కుటుంబాలకు భద్రత ఉంటుంది.

- నర్సింహస్వామి, తపాలా శాఖ వరంగల్ సూపరింటెండెంట్

విశేష స్పందన



నిర్వహిస్తున్న మేళాలకు విశేష స్పందన వస్తోంది. దరఖాస్తుదారుల సంఖ్య పెరుగుతోంది. పాలసీలు చాలా వరకు పెరిగాయి. దరఖాస్తు చేసుకోవడం కూడా ఇంట్లో నుంచే మొబైల్ ద్వారా చేసుకోవచ్చు. మిగిలిన కంపెనీల ఇన్సూరెన్స్ కంటే బోనస్ ఎక్కువ కావడంతో గ్రామాల్లో కూడా పాలసీ తీసుకునేందుకు ఇష్టపడుతున్నారు.

- కోట సుధాకర్, సీపీసీ మేనేజర్

అర్ధరాత్రి చోరీకి యత్నం

మంగపేట: మండలంలోని రమణక్కపేటలో శుక్రవారం మంచర్ల చందర్‌రావు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రలో ఉన్నారు. ఇంట్లో అన్ని పరిసర ప్రాంతాలు తెలిసిన వ్యక్తిగా ఇంటి తలుపులు తీసి చోరీకి వచ్చిన వ్యక్తి సెల్ ఫోన్ టార్చ్ ఆన్ చేసి చందర్‌రావు కుమార్తె మెడలో ఉన్న బంగారం తీసేందుకు యత్నించాడు. ఈక్రమంలో ఫోన్ వెలుతురు పక్కనే పడుకున్న తల్లిపై పడింది. దీంతో మెలుకువ వచ్చిన ఆమె లేచి చూస్తుండగా.. దొంగ పరారయ్యేందుకు యత్నించగా.. ఆమె కుటుంబ సభ్యులను లేపింది. దొంగను పట్టుకునేందుకు చందర్‌రావు వెంబడిస్తూ అరవడంతో స్థానికులు లేచారు. దొంగను పట్టుకునేందుకు ఎదురు తిరిగారు. గమనించిన దొంగ కొకంతి వెంకన్న ఇంటి నుంచి వెనుకాల ఉన్న దారి నుంచి పంట పొలాల్లోకి పరుగెత్తాడు. దీంతో ఎలాగైనా.. దొంగను పట్టుకోవాలన్న పట్టుదలతో సుమారు 50 మందికి పైగా గ్రామస్తులు వెంబడించారు. కొందరు ద్విచక్ర వాహనాలతో వెంబడించగా.. కొంత దూరం వరకు పరుగెత్తిన దొంగ మిర్చి తోటల్లోకి పారిపోయి తప్పించుకున్నాడు. కాగా.. గత నెల 26న పట్టపగలే గుర్తు తెలియని ఓ వ్యక్తి గుండారపు శ్రీను అనే రైతు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడ్డారు. మిర్చి అమ్మగా.. వచ్చిన రూ.50 వేల నగదు, రెండు తులాల బంగారం బీరువాలో ఉండగా.. చోరీకి పాల్పడిన వ్యక్తి బీరువాను తెరిచి అందులో ఉన్న నగదు, బంగారాన్ని ఎత్తుకుపోయాడు. 16 రోజుల వ్యవధిలో గ్రామంలో రెండు ఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

మిల్లు కార్యాలయాన్ని కార్మికుల పరం చేయాలి

- జీఎండబ్ల్యూపీ మావోయిస్టు డివిజన్ కార్యదర్శి వెంకటేశ్
- ఎమ్మెల్యే నరేందర్ ఆక్రమించాడని ఆరోపణ

వరంగల్: వరంగల్ ఆజాంజాహి మిల్లు కార్మికుల యూనియన్ కార్యాలయాన్ని వెంటనే కార్మికుల పరం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) జయశంకర్–మహబూబాబాద్–వరంగల్(2)–పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) డివిజన్ కార్యదర్శి వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ మహానగరంలో ఆజాంజాహి మిల్స్ ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద పరిశ్రమ అని, సుమారు 10 వేల మందికి ఉపాధి కల్పించిన ఘన చరిత్ర ఉందని పేర్కొన్నారు. నూతన ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చినప్పటి నుంచి దోపిడీ వర్గాలు నష్టాల పేరుతో పరిశ్రమలను అమ్మడం, మూసివేయడం చేస్తున్నాయని, అందులో భాగంగానే ఈ పరిశ్రమను కూడా మూసివేశారని తెలిపారు. దీంతో కార్మికులంతా వీధి పాలయ్యారని పేర్కొన్నారు. పరిశ్రమ స్థలాన్ని గత ప్రభుత్వాలే అమ్ముకున్నాయని, 1957లో ఆజాంజాహి మిల్స్ వర్కర్స్ యూనియన్ వెంకట్రామ టాకీస్ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే అత్యంత విలువైన 1400 గజాల స్థలంలో కార్మికులు హక్కుల కోసం పోరాడడానికి, కష్టసుఖాలు చెప్పుకోవడానికి కార్యాలయం నిర్మించుకున్నారని తెలిపారు. భూకబ్జాదారులు ఘన చరిత్ర కలిగిన ఆజాంజాహి మిల్లు కార్యాలయం, దాని స్థలంపై దృష్టి పెట్టారని పేర్కొన్నారు. బడాబాబు అయిన ఓ వ్యాపారి మరి కొంత మంది అనుచరులతో కలిసి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బినామి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకుని కబ్జా చేశారని ఆరోపించారు. దీన్ని పేరు మోసిన ఓ వ్యాపారికి విక్రయించారని పేర్కొన్నారు. ఇదంతా నాలుగేళ్లుగా సాగుతోందని, ఆపత్రాలతో బ్యాంకు నుంచి పెద్ద మొత్తంలో రుణం తీసుకున్నారని, ఈస్థలం కబ్జాతో కార్మికులంతా ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ లీడర్లంతా నగరంలో, పట్టణాల్లో, మండల సెంటర్లలో అధికారులను బెదిరించి, లంచాలు ఇచ్చి, సామాన్య ప్రజల భూములను కబ్జా చేసి అమ్ముకుంటున్నట్లు ఆరోపించారు. దాంతో ఘన చరిత్ర కలిగిన ఆజాంజాహి కార్యాలయం, దాని ఆవరణ స్థలాన్ని బడా బాబులు అమ్ముకుంటున్నట్లు తెలిపారు. ఆజాంజాహి మిల్స్ కార్మికులారా మీరు పైసా పైసా చందాలు వేసుకుని నిర్మించుకున్న కార్యాలయం, దాని స్థలాన్ని మీరంతా కలిసి కట్టుగా పోరాడి సాధించుకుని, మీరే ఉమ్మడిగా కార్యాలయాన్ని నిర్మించుకోవాలని డివిజన్ కమిటీ పిలుపునిస్తోందని వెంకటేశ్ ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ, కేంద్రంపై బీఆర్‌ఎస్ పోరాటం ఆగదు

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షిప్రతినిధి, వరంగల్: అక్రమ కేసులు, వేధింపులతో బీఆర్‌ఎస్ పార్టీని, నాయకులను ఏమీ చేయలేరని, బీజేపీ, కేంద్రంపై తమ పార్టీ పోరాటం ఆగదని రాష్ట పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. 'మీకు ఎదురుదిరిగితే ఈడీని వేట కుక్కల్లా ఉసిగొల్పుతున్నారు. వ్యాపారం చేసుకునే మా ఎంపీలు, మంత్రులు, కవిత మీద కేసులు పెట్టారు. ఈ కేసులకు భయపడం... ఈడీలు, మోదీల వేధింపులు మా నేతను మనస్థైర్యాన్ని దెబ్బతీయలేవు.. ప్రజలు గమనిస్తున్నారు.. మీకు తగ్గిన బుద్ధి చెబుతారు' అని హెచ్చరించారు. శనివారం సాయంత్రం హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, నరేందర్, 'కుడా' చైర్మన్ ఎస్.సుందర్‌రాజుతో కలిసి ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు క్షమించరానివని, మహిళలకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'దేశంలో మోదీ ఆడింది ఆట, పాడింది పాటగా మారింది. బీఆర్‌ఎస్ నేత, కేసీఆర్ దేశవ్యాప్తంగా అన్ని పార్టీలను కూడగట్టి తిరుగుతుంటే ఆయనకు లభిస్తున్న ఆదరణను చూసి బీజేపీ నేతలకు భయం పట్టుకుంది. తెలంగాణ మోడల్ పథకాలతో జనాన్ని ఎక్కడ ఆకట్టుకుంటారో? తమకేం నష్టం కలుగుతుందో?నని ఆందోళన చెందుతున్నారు. అందుకే వారి చేతిలో ఉన్న దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు' అని దయాకర్‌రావు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు కోసం కవిత ఆందోళన చేపట్టడంతో దేశంలోని మహిళలంతా ఎక్కడ ఏకమైపోతారోనని బీజేపీ ఇలా సమన్లు పంపి వేధిస్తోందన్నారు. బండి సంజయ్ తెలంగాణ ప్రాంతం వాడై ఉండి అమిత్‌షా చెప్పులు మోస్తున్నాడని ఆరోపించారు. 'కవిత ఉద్యమంలో పాల్గొన్నప్పుడు నువ్వెక్కడున్నవ్.. తెలంగాణ ఉద్యమంలో నీ మొఖం కనిపించిందా సంజయ్' అని ప్రశ్నించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కల్వకుంట్ల కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రౌడీలు, గుండాలు కుడా ఇటువంటి భాష వాడడం సిగ్గు చేటన్నారు. క్షమాపణ చెప్పే వరకు ఊర్కోబోమన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ మాట్లాడుతూ దర్యాప్తు సంస్థలను చెప్పు చేతల్లో పెట్టుకుని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే బీఆర్‌ఎస్ నేతలను టార్గెట్ చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ కవితకి చట్టాలపై గౌరవం ఉందని, అందుకే విచారణకు హాజరయ్యారన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పిల్లల పోషణ భారమై వివాహిత ఆత్మహత్య

- బిడ్డను, కొడుకును సాకాలని సోదరులకు సూసైడ్ నోట్



హైమ మృతదేహం

స్టేషన్‌ఘన్‌పూర్: కట్టుకున్న భర్త తనకు దూరంగా ఉన్నప్పటికీ పిల్లల యోగ క్షేమాలు చూడడం లేదనే మనస్థాపంతో శుక్రవారం సాయంత్రం మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన కొడారి హైమ(36) ఆత్మహత్య చేసుకుంది. హైమకు జఫర్‌గడ్ మండలం షాపల్లికి చెందిన కొడారి సాంబరాజుతో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం వారికి 16 ఏళ్ల కుమారుడు, 14 ఏళ్ల కుమార్తె ఉన్నారు. ఈ దంపతుల మధ్య గొడవల కారణంగా ఎనిమిదేళ్ల క్రితం భర్తతో విడిపోయింది. పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటోంది. సాంబరాజు మరో మహిళను వివాహం చేసుకున్నాడు. హైమతో వివాహ సమయంలో కట్నంగా ఇచ్చిన భూమి, బంగారాన్ని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. ఈక్రమంలో హైమ తన పిల్లల పోషణ, ఉన్నత చదువులకు, ఆర్థికంగా ఇబ్బంది అవుతోందని సాంబరాజుకు ఫోన్ చేసింది. అతడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆమె తీవ్ర మనస్థాపానికి గురైంది. శుక్రవారం సాయంత్రం కూల్ డ్రింక్‌లో విష గుళికలు కలిపి తాగి ఇప్పగూడేనికి వెళ్లే ఆటో ఎక్కి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆటో డ్రైవర్ సమాచారం అందించడంతో కుటుంబీకులు ఆమెను చికిత్స నిమిత్తం ఘన్‌పూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా.. అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి అన్న స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అన్నలూ.. నాబిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా!

కాగా.. మృతురాలి వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'అన్నలారా నా బిడ్డను, కొడుకును మీ చేతుల్లో పెడుతున్నా. నాబిడ్డకు పెళ్లి చేసేటప్పుడు ఆ భూమి రాసివ్వాలి' అని ఆమె సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు యత్నించినట్లు ఘన్‌పూర్ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్‌గౌడ్, ఏఎస్‌ఐ రాజమౌళి తెలిపారు.


ఆర్థిక ఇబ్బందులతో డ్రైవర్..



మహేశ్(ఫైల్)

చెన్నారావుపేట: మండల కేంద్రంలో ఆర్థిక ఇబ్బందులతో డీసీఎం డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై తోట మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన లక్క మహేశ్(39)కు ఇటుకాలపల్లికి చెందిన సరితతో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా.. కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తల మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. 20 రోజుల క్రితం ఎప్పటిలాగే గొడవ జరగడంతో సరిత పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన మహేశ్ ఈనెల 9న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేశ్ ఆత్మహత్య చేసుకున్న మూడ్రోజులకు శనివారం ఉదయం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో వృద్ధుడు..



సమ్మయ్య (ఫైల్)

నర్సంపేట రూరల్: కుటుంబ కలహాలతో మండలంలోని లక్నెపల్లి గ్రామానికి చెందిన లింగాల సమ్మయ్య (82) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె. కుమారుడు వరంగల్‌లో ఉంటున్నాడు. సమ్మయ్య, లక్ష్మి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో లక్ష్మి కొడుకు వద్దే ఉంటోంది. లక్నెపల్లిలో ఓ శుభకార్యం ఉండడంతో శనివారం లక్ష్మి స్వగ్రామానికి వచ్చింది. ఫంక్షన్ ముగించుకొని ఇంటి వద్దకు రాగానే.. మళ్లీ భార్యాభర్తలకు గొడవ మొదలైంది. దీంతో మనస్తాపానికి గురైన సమ్మయ్య ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై పోలీసుల వివరణ కోరగా.. ఫిర్యాదు అందలేదన్నారు.

పల్లకిలో పెళ్లి కూతురు

ఫొటో స్టోరీ



పాత సంప్రదాయం ప్రకారం పెళ్లి కూతురును పల్లకిలో ఊరేగింపుగా పెళ్లి మండపానికి తీసుకెళ్లి వివాహం జరిపించారు. మండల కేంద్రానికి చెందిన పాము కీర్తనకు ఉమేశ్ అనే యువకుడితో పాతకాలం నాటి ఆచార, సంప్రదాయాల ప్రకారం శనివారం పెళ్లి జరిపించారు. కాగా.. పెళ్లి కూతురును పల్లకిలో తీసుకెళ్తుండగా.. స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

-కేసముద్రం

మానసిక దివ్యాంగురాలిపై వృద్ధుడి లైంగిక దాడి

దుగ్గొండి: ఒంటరిగా ఉన్న మానసిక దివ్యాంగురాలైన యువతిపై ఓ వృద్ధుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన మండలంలోని తొగర్రాయిలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధుడు తన ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న ఓ మానసిక దివ్యాంగురాలైన యువతిపై కొద్ది రోజులుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈక్రమంలో వారం క్రితం లైంగిక దాడికి యత్నించాడు. దీంతో సదరు యువతి తన కుటుంబ సభ్యులకు తెలపగా.. వారు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వృద్ధుడు సూరయ్యను రెండ్రోజుల క్రితమే అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిసింది. కేసు వివరాలు పోలీసులు మీడియాకు వెల్లడించకపోవడంతో విషయం కాస్తా.. వాట్సాప్ గ్రూపుల్లో శనివారం హల్‌చల్ చేసింది.

కుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి

శాయంపేట: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఐదోతరగతి విద్యార్థి శనివారం మధ్యాహ్నం ఇంటికి వెళ్తుండగా.. కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. మండలంలోని కొత్తగట్టు సింగారానికి చెందిన గంధ్రాతి రమ అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదోతరగతి చదువుతోంది. పాఠశాలకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికొస్తుండగా కుక్కల గుంపు బాలిక పైకి వచ్చింది. కుక్కల దాడిలో చిన్నారి కుడి కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు గమనించి శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

రూ.1.96 లక్షలు మాయం

కాజీపేట: కాజీపేట మండలం దర్గా కాజీపేటకు చెందిన ఓ మహిళ సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి రూ.2 లక్షలు పోగొట్టుకుంది. ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఫిర్యాదు చేసింది. గత నెల 24న దర్గా కాజీపేటకు చెందిన మహిళకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత రుణాన్ని మంజూరు చేశారు. రూ.2లక్షలు మహిళ బ్యాంకు ఖాతాలో జమయ్యిన కొద్దిసేపటికి ఓటీపీ నంబర్ చెప్పాలని కోరారు. నిజమేనని నమ్మిన ఆమె ఓటీపీ చెప్పింది. బ్యాంకు ఖాతా నుంచి రూ.1.96 లక్షల నగదు మాయం అవడంతో బాధితురాలు తాను మోసపోయినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు.